క్లుప్తంగా

పత్రాలు అందుకునేందుకు తరలిన జీపీఓలు



బస్సులో వెళ్తున్న జీపీఓలకు అభినందనలు తెలిపిన అధికారులు

ఇబ్రహీంపట్నం: గ్రామ పరిపాలన అధికారుల నియామక పత్రాలను అందుకునేందుకు ఎంపికైన వారందరూ శుక్రవారం ఇబ్రహీంపట్నం నుంచి నగరానికి తరలివెళ్లారు. డివిజన్ పరిధిలో సుమారు 81 మంది జీపీఓలు ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మాదాపూర్ హైటెక్స్‌లో.. నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పత్రాలు అందుకునేందుకు వెళ్తున్న క్రమంలో.. వారికి తహసీల్దార్ సునితా రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐ సువర్ణ తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాతృ సంస్థకు వెళ్తున్న ఆనందం జీపీఓలుగా ఎంపికైన వారి కళ్లల్లో కనిపించింది.

పశుపోషణలో జాగ్రత్తలు తప్పనిసరి



వైద్య శిబిరంలో పశువైద్యాధికారి మధుసూదన్ తదితరులు

మంచాల: పశు పోషణ సక్రమంగా లేకపోతే నష్టం జరుగుతుందని, పెంపకం విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ అన్నారు. శుక్రవారం మండల పరిధి అస్మత్‌పూర్‌లో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువులకు గర్భదారణ పరీక్షలు, గర్భకోశవ్యాధి చికిత్స, దూడలకు నట్టల నివారణ మందులు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య శాఖ జిల్లా అధికారులు పున్నయ్య, రమణ, మండల వైద్యాధికారి సుధారెడ్డి, వైద్యులు సుధా, వసంత, సహాయకులు మల్లేశ్వరి, వీరారెడ్డి, బాలు, శ్రీను పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో మేలు



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

తుర్కయంజాల్: జీఎస్టీని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో మందికి మేలు చేకూరనుందని బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేష్ అన్నారు. శుక్రవారం ఆ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎలిమినేటి నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తూళ్ల నర్సింహ గౌడ్, పలుస శ్రావణ్ కుమార్ గౌడ్, కొత్త రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబార్డినేట్‌కు.. పదోన్నతి

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లి గ్రామం పశువైద్య కేంద్రంలో కార్యాలయ సబార్డినేట్‌గా పనిచేస్తున్న అఫ్సర్.. వెటర్నరీ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందాడు. ఈ మేరకు వెటర్నరీ అసిస్టెంట్ జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో శుక్రవారం జేడీ మధుసూదన్ చేతుల మీదుగా అఫ్సర్ పదోన్నతి పత్రాన్ని అందుకున్నారు. అఫ్సర్‌ను కందుకూరు పశువైద్యశాలకు బదిలీ చేశారు.

ఇళ్లను నాణ్యతగా నిర్మించుకోవాలి

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీమ్‌భరత్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎత్‌మార్‌పల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇళ్లను నాణ్యతతో నిర్మించుకోవాలని సూచించారు. పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జైపాల్‌రెడ్డి, నిరంజన్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, మానయ్య, కేబుల్ రాజు, కిరణ్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనం..భయంభయం

వర్షం వస్తే జల్లెడే!
- నెర్రలు వారి, నాచుపట్టి కూలడానికి సిద్ధంగా వ్యవసాయ శాఖ కార్యాలయం
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది, అన్నదాతలు
- సొంతగా కొత్త భవనం నిర్మించాలని రైతుల డిమాండ్



పశువైద్య కేంద్రంలో కొనసాగుతున్న వ్యవసాయ శాఖ కార్యాలయ దుస్థితి

కడ్తాల్: వ్యవసాయాన్ని పండగలా చేస్తాం. రైతులకు అందుబాటులో ఉంటూ.. సాగులో వారికి సలహాలు, సూచనలు ఇచ్చి, అధిక దిగుబడులు పొందేలా ప్రోత్సహిస్తాం. రాయితీతో సాగు పరికరాలను అందజేస్తాం. వారి అవసరం మేరకు ఎరువును అందుబాటులో ఉంచుతాం. రైతును రాజును చేస్తామని మన పాలకులు పదేపదే చెబుతుంటారు. వారి మాటల్లో వాస్తవం ఎంత ఉందో కానీ.. ప్రస్తుతం యూరియా లేమితో కర్షకులు ఎదుర్కొంటున్న కష్టాలను రాష్ట్ర వ్యాప్తంగా చూస్తున్నాం. ఇక రైతులకు సేవలు అందించే వ్యవసాయ శాఖకు మండల కేంద్రంలో నేటి వరకు సొంత భవనం లేదు. పశువైద్య కేంద్రం, అదీ శిథిల భవనం. అందులో కొనసాగుతున్న కార్యకలాపాలను చూస్తుంటే.. ఆ శాఖపై పాలకులు చూపిస్తున్న శ్రద్ధ ఏమిటో తెలుస్తోంది.

చెట్లకిందే నిరీక్షణ

2016లో మండల కేంద్రంగా కడ్తాల్ అవతరించింది. అప్పట్లో పశువైద్యశాలలోని పాతభవనంలో శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు అందులోనే శాఖ కార్యాలయాలు కొనసాగుతున్నప్పటికీ.. ఆ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గోడలు నెర్రలు వారాయి. కురుస్తున్న వర్షాలతో వాటిని పూర్తిగా నిమ్ము ఆవహించింది. దీంతో అక్కడి సిబ్బందితో పాటు.. వచ్చే రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక మౌలిక వసతులు కూడా సరిగా లేకపోవడంతో ముఖ్యంగా మహిళా రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇరుకైన కార్యాలయం, సౌకర్యాల లేమితో అక్కడికి వచ్చే రైతులు.. తమ పని అయ్యేవరకు ప్రాంగణంలోని చెట్లకిందే నిరీక్షిస్తున్నారు.

క్షణక్షణం..

ప్రస్తుతం కార్యకలాపాలు కొనసాగుతున్న భవనం 1965లో నిర్మించారు. అరవై ఏళ్ల పైబడటంతో ఆ భవనం శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో కురవడంతో పాటు, పైకప్పు పెచ్చులు ఊడిపడుతుంటాయని, దానికి తోడు నెర్రలు వారి, నాచుపట్టిన గోడలతో ఉన్న మిద్దె ప్రమాదకరంగా ఉందని రైతులు, అక్కడి సిబ్బంది పేర్కొంటున్నారు. ఎప్పుడు కూలుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇంకా ఎన్నాళ్లు ఈ శిథిల భవనంలో కార్యాలయాన్ని కొనసాగిస్తారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి, వ్యవసాయ శాఖ కార్యాలయానికి కొత్తగా భవనం నిర్మించాలని రైతులు కోరుతున్నారు.



పెచ్చులూడిన పైకప్పు



హనుమాన్ ఆలయ మార్గం ఇరువైపులా పరుచుకున్న వరిపైర్లు

చిత్రం.. పరవశం

ప్రకృతి అందాలతో మిళితమైపోతే అదో కొత్త అనుభూతిని కలిగిస్తాయి. ఇక్కడ కనిపిస్తున్న చిత్రాలు ఆ కోవలకే వస్తాయి. కాకపోతే ఇవి దేనికి అదే సాటి. ఒకటి ఆదిబట్ల మున్సిపాలిటీ, ఎంపీపటేల్‌గూడలో హనుమాన్ దేవాలయం వెళ్లే మార్గంలో ఇరువైపులా పరుచుకున్న పచ్చని వరి పైర్లు.. భూమికి పచ్చాని రంగేసినట్లు తలపిస్తూ ఆహ్లాదాన్ని పంచుతుండగా.. మరొకటి చింతపల్లిగూడలో రహదారి పక్కనే పార్కింగ్ చేసిన దుక్కులు దున్నే ట్రాక్టర్‌ను ఏపుగా పెరిగిన గడ్డి పరకలు, పిచ్చిమొలు పూర్తిగా కప్పేసి కనువిందు చేస్తున్నాయి. –ఇబ్రహీంపట్నం రూరల్



ట్రాక్టర్‌ను కమ్మేసిన పచ్చని మొక్కలు

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆమనగల్లు: తలకొండపల్లి మండల గ్రామీణ వైద్యుల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేశ్, ఉపాధ్యక్షుడిగా పాండు, ప్రధాన కార్యదర్శిగా శివకృష్ణ, కార్యదర్శులుగా రామకృష్ణ, శేఖర్, ప్రచార కార్యదర్శిగా వెంకటేశ్, కోశాధికారిగా శివకుమార్, కార్యవర్గ సభ్యులుగా ప్రభాకర్, జగన్, మాణిక్యం, గౌరవాధ్యక్షులుగా రవి, ప్రసాద్‌లను నియమించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను సన్మానించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

కడ్తాల్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రం, పరిధిలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మక్తమాధారంలో ప్రిన్సిపాల్ రమేశ్‌ను పూర్వ విద్యార్థులు యాదగిరి, జంగయ్య, రాఖీలు ఘనంగా సన్మానించారు. జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు తలకొండపల్లి మండల కేంద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను పలువురు నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

అక్రమాలను నిరూపిస్తే దేనికైనా సిద్ధం

షాద్‌నగర్‌రూరల్: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్ బాబర్ సవాల్ విసిరారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల పదవీకాలంలో అక్రమాలకు పాల్పడలేదని, గుంట భూమి కొనలేదని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పుడు అధికారాన్ని అడ్డు పెట్టుకొని ఆయన అందినకాడికి దోచుకున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం చూస్తుంటే దొంగే..దొంగ దొంగ అన్నట్లు ఉందన్నారు. కాళేశ్వరంలో జరిగిన అవినీతి గురించి ఎమ్మెల్యే శంకర్ మాట్లాడితే ఇక్కడి బీఆర్ఎస్ నేతలకు కడుపుమంట ఎందుకని ఎద్దేవా చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రఘునాయక్, తిరుపతిరెడ్డి, బస్వం, పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీను, గోవర్ధన్‌గౌడ్, సత్యంరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అలీఖాన్‌బాబర్

ఎప్పుడొస్తదో.. ఎప్పుడు పోతదో

- గ్రామాల్లో వెంటాడుతున్న కరెంట్ కష్టాలు
- బ్రేక్‌డౌన్ పేరుతో కోతలు
- ఇబ్బంది పడుతున్న వినియోగదారులు



మంచాల సబ్ స్టేషన్

మంచాల: అప్రకటిత కరెంట్ కోతలతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియక వినియోగదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సుమారు ఇరవై ఏళ్ల క్రితం మండలంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉండేది. నాడు కేవలం మంచాల, బోడకొండ గ్రామాల్లో మాత్రమే సబ్ స్టేషన్ ఉండటంతో సమస్య తప్పేది కాదు. క్రమంగా వినియోగం పెరగడంతో తరచూ లోఓల్టేజీ సమస్య ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో.. పదేళ్ల క్రితం జాపాల, ఆరుట్ల, లోయపల్లి గ్రామాల్లో కొత్తగా సబ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. కొంత వరకు సమస్య పరిష్కారం అయినట్టే అయింది. కానీ ఇటీవల కాలం నుంచి సమస్య తీవ్రరూపం దాల్చిందని ప్రాంత ప్రజలు పలువురు పేర్కొంటున్నారు.

రాత్రిపూట నిలిపివేత

బ్రేక్‌డౌన్ పేరుతో నిత్యం విద్యుత్ సరఫరా సమస్య ఉన్నప్పటికీ.. సంధ్య వేళ, రాత్రిపూట కష్టాలు చెప్పలేనివి. గంటకు రెండు దఫాలుగా సరఫరా నిలిచిపోతోంది. కొన్నిసార్లు గంటల కొద్దీ ఆటంకం కలుగుతోంది. రాత్రి 11 గంటల సమయంలో త్రీఫేజ్ మారే క్రమంలో అర గంట నుంచి గంట వరకు కరెంట్ ఉండదని బాధిత గ్రామాల ప్రజలు వివరించారు. అసలే సీజన్ వ్యాధుల కాలం. ఆపై ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నీరు నిలిచి, మురుగు కాల్వలు ముందుకు సాగని దుస్థితి. దీంతో పెరిగిన దోమల బెడదతో కంటిమీద కునుకు లేకుండా పోతోందని వాపోతున్నారు. ప్రధానంగా మండల పరిధి రంగాపూర్, చీదేడ్, దాద్‌పల్లి, తిప్పాయిగూడ గ్రామాల్లో ఎక్కువగా సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ ప్రాంత ప్రజలు తెలిపారు. సరఫరాలో లోఓల్టేజీ కారణంగా మోటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయని వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి



ప్రధానంగా రంగాపూర్, చీదేడ్, దాద్‌పల్లి గ్రామాలకు ప్రత్యేకంగా విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి. అప్పుడే సమస్య పరిష్కారం అవుతుంది. ఇదే విషయాన్ని ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. – విజయ్‌కుమార్, రంగాపూర్

మోటర్లు కాలి పోతున్నాయి



లోఓల్టేజీ కారణంగా మోటర్లు కాలి పోతున్నాయి. దీంతో రైతులు నష్టపోతున్నారు. ఇళ్లల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు దెబ్బతింటున్నాయి. సమయానుకూలంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలి. – చివరాల పాండు, తిప్పాయిగూడ

పరిష్కరిస్తాం

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. 24 గంటల్లో 18 గంటలు త్రీఫేజ్, 6 గంటలు సింగిల్ ఫేజ్ కరెంట్ అందించేందుకు కృషి చేస్తాం. ఎక్కడా సరఫరాకు ఆటంకం కలగకుండా చూస్తాం. –బాజీసింగ్, ఏఈ, మంచాల



కడ్తాల్: మైసిగండిలో లడ్డూను రూ.3.01 లక్షలకు కైవసం చేసుకున్న భక్తుడు సుమన్‌నాయక్



కడ్తాల్: అన్మాస్‌పల్లిలో రూ.1.90 లక్షలకు పెద్ద లడ్డును దక్కించుకున్న అనిల్‌యాదవ్



మాడ్గుల: నర్సాయిపల్లిలో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీసీపీ సునితారెడ్డి



ఇబ్రహీంపట్నం: పీఎస్ వినాయకుడి శోభాయాత్రలో ఏసీపీ రాజు, సీఐ మహేందర్‌రెడ్డి



కడ్తాల్: ఎక్వాయిపల్లిలో పూజలు అందుకుంటున్న గణపతి

బైబై గణేశా..

వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాల్లో కొలువుదీరిన గణపతికి శుక్రవారం భక్తజనం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. 10వ రోజు కావడంతో నవరాత్రులు పూజలందుకున్న బొజ్జగణపయ్యను పలుచోట్ల ఊరేగింపుగా, ఆటపాటలతో గంగమ్మ ఒడికి చేర్చారు. నిమజ్జనాన్ని పురస్కరించుకొని స్వామివారి చేతిలోని లడ్డూను వేలంలో కైవసం చేసుకోవడానికి భక్తులు పోటీపడ్డారు. రూ.లక్షలు వెచ్చించి సొంతం చేసుకున్నారు. –సాక్షి, నెట్‌వర్క్



కడ్తాల్: మక్తమాధారంలో..



కడ్తాల్: నిమజ్జన శోభాయాత్రలో భక్తులు



ఇబ్రహీంపట్నంలో..



ఇబ్రహీంపట్నంలో..



యాచారంలో..



ఆమనగల్లు: గణనాథుని సన్నిధిలో భక్తులు



ఆమనగల్లు: శక్తియూత్ ఆధ్వర్యంలో



ఇబ్రహీంపట్నం: శోభాయాత్రగా గంగమ్మచెంతకు తరలుతున్న గణనాథుడు



మంచాల: స్వామివారి ప్రసాదాన్ని రూ.2.116 లక్షలకు దక్కించుకున్న భక్తుడు రాజిరెడ్డి



యాచారం: మాల్‌లో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తదితరులు



తుర్కయంజాల్: నిమజ్జన ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ అమరేందర్ రెడ్డి



ఆమనగల్లు: తలకొండపల్లిలో ఎస్ఐలు శ్రీకాంత్, శేఖర్